## ‘వందే’ ఆలయం

- నియోజకవర్గానికి 100 ఆలయాల మంజూరు
- రూ.10 కోట్లతో చురుగ్గా నిర్మాణం
- వై.బి.పట్నంలో వినాయకుడి ఆలయం నేడు ప్రారంభం



వై.బి.పట్నంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన వినాయకుడి ఆలయం

నాతవరం: ఇటు దైవ కార్యాల్లోనూ.. అటు శుభకార్యాల్లోనూ వినాయకుడు తొలి పూజను అందుకోవడమే ప్రాచీనకాలం నుంచి వస్తోంది. వినాయకుడికి నమస్కరిస్తే చాలు... తలపెట్టిన కార్యాలు ఎలాంటి విఘ్నాలు కలగకుండా పూర్తవుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ కారణంగానే నియోజకవర్గంలో శ్రీకారం చుట్టిన వంద దేవాలయాల నిర్మాణాల్లో భాగంగా గణపతి ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ ఆలయాన్ని ఎమ్మెల్యే పెట్ల గణేష్ గురువారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు..**

ప్రజలను ఆధ్యాత్మిక భావం వైపు మళ్లించేందుకు నియోజకవర్గంలో నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో వంద దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.10 కోట్లు విడుదల చేసింది. ఇందులో భాగంగా తొలుత నాతవరం మండలం వై.బి.పట్నంలో వినాయక ఆలయ నిర్మాణం పూర్తయింది.

**వివిధ దశల్లో మిగిలిన ఆలయాల నిర్మాణం..**

నియోజకవర్గంలో ఇంతవరకు 66 దేవాలయాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పదిపైగా ఆలయాలు ప్రారంభోత్సవానికి చేరువలో ఉండగా, 15పైగా పునాదుల దశ పూర్తి చేసుకున్నాయి. కొన్ని గ్రామాల్లో స్థల వివాదం ఉంది. ఇది పరిష్కారమైతే ఆయా గ్రామాల్లోనూ ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అధికారులు దృష్టి సారించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా గానీ పార్టీపరంగా గానీ ఎమ్మెల్యే గణేష్ నాతవరం మండలంలోనే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

### చాలా ఆనందంగా ఉంది



నియోజకవర్గంలోనే తొలిసారిగా మా గ్రామంలోనే వినాయకుడి ఆలయం నిర్మించడం ఆనందంగా ఉంది. గురువారం ఉదయం 8 గంటలకు వేదపండితుల పూజా కార్యక్రమాల నడుమ ఎమ్మెల్యేతో ఆలయాన్ని ప్రారంభిస్తాం. గ్రామస్తుల ఏళ్లనాటి కల నెరవేరడం శుభ పరిణామంగా భావిస్తున్నాం.

– గొర్లె వెంకట సత్యవేణి, సర్పంచ్, వై.బి.పట్నం

### సీఎంకు, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కృషితో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో గన్నవరం పంచాయతీ శివారు గ్రామం వై.బి.పట్నం నూతన పంచాయతీగా ఏర్పాటైంది. ఈ పంచాయతీ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలుత వినాయకుడి ఆలయాన్ని రూ.10 లక్షలతో నిర్మించడం ఆనందంగా ఉంది. సీఎంకు, ఎమ్మెల్యేకు జీవితాంతం మేమంతా రుణపడి ఉంటాం.

– గొర్లె వరహాలబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, గన్నవరం

## క్లుప్తంగా

### కేపీ అగ్రహారం అభివృద్ధికి కృషి చేస్తా



శంకుస్థాపనలో పాల్గొన్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: కేపీ అగ్రహారం గ్రామాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. గ్రామంలో జిల్లా పరిషత్ అభివృద్ధి నిధుల నుంచి రూ.5 లక్షలతో చేపట్టే మరిడిమాంబ ఆలయ మండప నిర్మాణ పనులకు బుధవారం ఆయన మండల నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. త్వరలోనే మండప నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారుడికి సూచించారు. సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఎంపీటీసీ దేవర అప్పారావు, ఉప సర్పంచ్ ముసలినాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మిడిశెట్టి రమణాజీ పాల్గొన్నారు.

### వరసిద్ధి వినాయకుడికి విశేష పూజలు



హోమం చేస్తున్న దృశ్యం

రావికమతం: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా పలువురి దంపతులతో అర్చకుడు లక్ష్మణ రావు దూర్వాయుగ్మార్చన, ప్రత్యేక పుష్పార్చన, విశేష సుగంధ ద్రవ్యాలతో లక్ష్మీగణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు.

### యోగాతో ఆరోగ్యం



యోగా శిక్షణను పర్యవేక్షిస్తున్న సౌమ్య

కె.కోటపాడు: యోగా శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరగడంతోపాటు ఆరోగ్యం కలగనున్నట్లు గ్రంథపాలకురాలు సౌమ్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో పుస్తక పఠనంతోపాటు విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. చదువుతోపాటు విజ్ఞానం పెంపునకు ఈ నెల 11 వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

### ఘనంగా గరగ మహోత్సవం



మోదకొండమ్మతల్లి గరగ తీస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట మోదకొండమ్మతల్లి మహోత్సవం ఈ నెల 11న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా బుధవారం సతకంపట్టు నుంచి గరగ తీసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శానాపతి అప్పారావు, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే నాణ్యమైన పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో మీనా కుమారి తెలిపారు. బుధవారం చింతలూరు శివారు గ్రామం గదబూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. గర్భిణులు, చిన్నారుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా అని, వారిని అడిగి తెలుసుకున్నారు. బాగుంటుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## గొల్లలపాలెం – మర్రివలస రోడ్డుకు మోక్షం

- రూ.1.15 కోట్లతో బీటీరోడ్డు



కొలతలు వేస్తున్న అధికారులు, ఎంపీపీ

రావికమతం: గొల్లలపాలెం–మర్రివలస రోడ్డుకు మోక్షం లభించింది. కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఈ రహదారిని బీటీరోడ్డుగా మార్చేందుకు కోటి 15 లక్షల 80 వేల రూపాయలు మంజూరయ్యాయి. వీటితో చేపట్టే పనులకు భూమిపూజ చేయడంతోపాటు బుధవారం అధికారులు కొలతలు తీసుకున్నారు. మర్రివలస శివారు గొల్లలపాలెంకు సరైన రహదారి లేదు. కాలువ రోడ్డే ఉండేది. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఏళ్ల తరబడి ఎన్నికల వాగ్దానంగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇక్కడ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద నిధులు మంజూరయ్యాయి. ఎనిమిది మీటర్ల మేర రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రాజెక్ట్స్ డీఈ మోహన్, ఎంపీపీ పైల రాజు ఈ పనులు ప్రారంభించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ జగ్గారావు, మర్రివలస మాజీ సర్పంచ్ ఎలిశెట్టి అనంతరమణ పాల్గొన్నారు. ఎన్నోయేళ్ల తరబడి బురద, పెద్ద పెద్ద గోతులతో ఉన్న రహదారిని తారురోడ్డుగా మార్చుతున్న ధర్మశ్రీకి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మాకవరపాలెం: చినరాచపల్లిలో అడవిరాజుల బాబు ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఆలయం లేకపోవడంతో వీరంతా రూ.5 లక్షల చందాలతో ఆలయ నిర్మించేందుకు నిర్ణయించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుర్ల లక్ష్మీనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### వ్యాధినిరోధక టీకాలతో మెరుగైన ఆరోగ్యం



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న హెచ్ఏ త్రినాథ్

కె.కోటపాడు: ఐదేళ్ల లోపు చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్ఏ పి.త్రినాథ్ తెలిపారు. బుధవారం ఎ.కోడూరు ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఐదేళ్లలోపు 24 మంది చిన్నారులకు పెంటావాలెంట్, రోటా, డీపీటీ, ఐపీవీ, పీసీవీ వ్యాక్సిన్స్ వేశారు. చిన్నారులకు వీటిని వేయడం వల్ల వారిలో వ్యాధులను ఎదుర్కోగలిగే శక్తి సమకూరడంతోపాటు ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్ఎం సంతోషి పాల్గొన్నారు.

## సమగ్ర చట్టం అమలు చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ముఠా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముందుగా జిల్లా ఉపాధ్యక్షుడు డి.సత్తిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ నర్సీపట్నంలో ముఠా కార్మికులకు ఇళ్లు లేవన్నారు. శక్తి ఉన్నంత కాలం పని చేసి వయసు మళ్లిన తర్వాత జీవనాన్ని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. భవన నిర్మాణ కార్మికుల వలే సమగ్ర సంక్షేమ చట్టం చేయాలన్నారు. ముఠా కార్మిక సంఘం సెక్రటరీగా అడిగర్ల రాజును ఎన్నుకున్నారు. ముఠా కార్మిక సంఘం ప్రెసిడెంట్ రుత్తల గోవింద్, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎం.రమణ, నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## కార్మిక నేత సోమేశ్వరరావు మృతికి సంతాపం



సోమేశ్వరరావు (ఫైల్)

చోడవరం రూరల్: భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు కొసర సోమేశ్వర రావు బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు. 1970లో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులను ఐక్యం చేసి సంఘాన్ని స్థాపించడంలో ప్రధాన భూమిక వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తె ఉన్నారు. సోమేశ్వరరావు మృతి భవన నిర్మాణ కార్మికులకు తీరని లోటని అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ అన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి పడాల రమణ, చోడవరం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పెమ్మే బాబ్జి, కొసర తాతారావు, గుమ్మాల అమ్మతల్లి, పరమేశ్వరరావు, తదితరులు సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## జగనన్న పాలనలోనే నేరుగా సంక్షేమ లబ్ధి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సమస్యలేమైనా ఉన్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

రావికమతం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే పేదలందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని, మళ్లీ ఆయన్నే గెలిపించుకుని మరింత లబ్ధి పొందుదామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం రాత్రి గుమ్మాళ్లపాడు, మత్స్యపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి పథకాలన్నీ అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో 15 ఇళ్ల ప్రజల వాడుక నీరు బయటకు పోవడం లేదని పరిష్కారం చూపాలని ఎస్సీ కాలనీ వాసులు పారుపల్లి అప్పారావు, మామిడి రమణమ్మ, తదితరులు కోరారు. కెం.చానల్‌కు పెద్దేరు నీరివ్వాలని నక్కా వీరునాయుడు, జోగినాయుడు, ఇల్లపు పెద సత్యనారాయణ తదితర రైతులు విన్నవించారు. ఉపాధి జాబ్‌కార్డులు రద్దయిపోతున్నాయని, తమకు ఇళ్లు మంజూరు చేయాలని మత్స్యపురం గ్రామానికి చెందిన మామిడి నూకాలమ్మ, మారుడుబిల్లి నూకాలమ్మ కుమారి, తదితరులు ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వితంతు పింఛన్ రాలేదని కోరుకొండ అప్పలనర్స మొరపెట్టుకుంది. వెంటనే అక్కడే ఉన్న సచివాలయ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల నుంచి రానుందని బదులిచ్చారు. మిద్దె రాములు పింఛన్ మంజూరు కాలేదని ధర్మశ్రీ దృష్టికి తీసుకురాగా, తన అక్కతో కలిసి ఒకే రేషన్ కార్డులో ఉండటం వల్ల రెండో పింఛన్ మంజూరు కాలేదని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ బంటు విజయలక్ష్మి శ్రీనివాసరావు, కొమార ప్రసాద్, జనపాల వెంకట్రావు, కొమిర సర్పంచ్ గొర్లె రవికుమార్, గోపాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

### ప్రభుత్వ విప్‌కు పెన్సిల్ చిత్రం బహూకరణ



లోకేషును అభినందిస్తున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: పెన్సిల్‌తో తన చిత్రాన్ని వేసి బహూకరించిన దివ్యాంగుడు కోసూరి లోకేష్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అభినందించారు. చినపాచిలకు చెందిన లోకేష్ ఐటీఐ చదివాడు. పదేళ్ల క్రితం అతని అమ్మమ్మ ఇంటికి వెళ్లి విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఎడమ చేయి కోల్పోయాడు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉండటం ఇష్టం లేక చిత్రకారుడిగా బొమ్మలు వేస్తున్నాడు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆ గ్రామానికి వచ్చిన ధర్మశ్రీకి చిత్రపటాన్ని అందించాడు. అతని నైపుణ్యానికి ముగ్ధుడై అభినందించారు. జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగం పొందాలని, తన సహాయ సహకారాలందిస్తానని హామీ ఇచ్చారు.

### ముగిసిన సురభి నాటకాలు



భక్త ప్రహ్లాద నాటకంలో ఓ సన్నివేశం

మాడుగుల: మోదకొండమ్మ జాతర సందర్భంగా మహరాజుల కోటలో మంగళవారం రాత్రి సురభి నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిత్ర విచిత్రమైన సెట్టింగ్‌లు చూపరులను కట్టిపడేశాయి. భక్త ప్రహ్లాద నాటకంలో కళాకారులు ప్రతి సన్నివేశం కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ నెల 2న ప్రారంభమైన ఈ నాటకాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా నాటక బృంద సభ్యులను ఆలయ కమిటీ సభ్యులుతోపాటు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

## ఎండకు అల్లాడుతున్న ప్రజలు



బుచ్చెయ్యపేటలో గొడుగు వేసుకుని పశువులను మేపుతున్న రైతు

బుచ్చెయ్యపేట: రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతోంది. జూన్ మాసంలోనూ భానుడి భగభగలు ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జనం విలవిలలాడుతున్నారు. పదిహేను రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదు కావడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజువారి కూలీలు, ఎండలో పనిచేసేవారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పలువురు వడదెబ్బకు గురై అనారోగ్యం పాలవుతున్నారు. ఒక పక్క వర్షాలు కురుస్తున్నా ఉష్ణతాపం తగ్గకపోవడం గమనార్హం

## ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



గిడుతూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గిడుతూరులో బుధవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఎంతమేర పథకాల రూపంలో లబ్ధి చేకూర్చిందో వివరించారు. వారి పేరున ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు అర్హులకు పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులున్నా ప్రజా సంక్షేమంలో వెనక్కి తగ్గకుండా పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు చిటికెల రమణ, బొడ్డు గోవిందరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, నాయకులు మూకల బాలకృష్ణ, భద్రాచలం, నూకన్ననాయుడు, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ పరసాదరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## రైతు గ్రూపులకు పూర్తి సహకారం

- కలెక్షన్ సెంటర్లను పరిశీలించిన రాష్ట్ర ఉద్యానవన శాఖ జేడీ హనుమంతరావు



గొండుపాలెంలో కలెక్షన్ సెంటర్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న జేడీ హనుమంతరావు

కె.కోటపాడు: రైతులు గ్రూపులుగా ఏర్పడి వ్యవసాయం చేస్తే ఉద్యానవన శాఖ ద్వారా పూర్తి సహకారాన్ని అందించనున్నట్లు రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ పి.హనుమంతరావు అన్నారు. కె.కోటపాడు మండలం కె.సంతపాలెం, గొండుపాలెం, కింతాడ గ్రామాల్లో ఉద్యానవన శాఖ సహకారంతో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్ల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి ఏర్పాటు వల్ల సంఘంలో రైతులు పంటల అమ్మకాలు, నిల్వలు చేసుకోవచ్చన్నారు. గతంలో పంటను నిల్వ ఉంచలేని పరిస్థితిలో తక్కువ ధరకే అమ్మకాలు చేసుకునే వారని వాపోయారు. దీంతో పంటకు మద్దతు ధర పొందని పరిస్థితి ఉండేదన్నారు. వీరి ఇబ్బందులకు కొంత వరకైనా పరిష్కారం చూపేందుకు ఈ భవనాల నిర్మాణాన్ని రాయితీపై రుణాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లాలో 29 రైతు సంఘాలకు రాయితీపై కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిర్మాణాలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నట్లు వివరించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సభ్యులు లాలం అచ్చంనాయుడు, బండారు దేముళ్లు, రెడ్డి నాయుడు పాల్గొన్నారు.

## మురుగు నిల్వతో రోగాలు



రొంగలినాయుడుపాలెంలో మురుగు తొలగించాలని ప్రజలకు వివరిస్తున్న రాజు

కె.కోటపాడు: గ్రామాల్లో మురుగు నిల్వలను ఎక్కువ రోజులపాటు ఉంచకూడదన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు సూచించారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా రొంగలినాయుడుపాలెంలో బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో ఆయన తిరుగుతూ దోమలు వృద్ధి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఖాళీటైర్లు, రుబ్బురోళ్లతోపాటు బోర్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలంలో నిల్వ నీటి సమస్య ఎక్కువ ఉండటంతోపాటు దోమల వ్యాప్తి అధికంగా ఉండే పరిస్థితులు ఉంటాయన్నారు. ఈ కారణంగా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు దోమకాటు వల్ల వస్తాయన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలతోనే ప్రజల మన్ననలు



తహసీల్దార్ కనకారావును సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

నాతవరం: ప్రభుత్వోద్యోగులకు బదిలీ అనేది విధుల్లో సర్వ సాధారణమని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. ఇంతవరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన ఆయన పరవాడ తహసీల్దార్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు కనకారావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే నాతవరం మండలానికి ప్రత్యేకత ఉందన్నారు. జిల్లాకు శివారు ఉండటంతో చాలా మంది ఉద్యోగులు ఇక్కడకు రావడానికి వెనుకంజ వేస్తారన్నారు. వచ్చాక బదిలీపై వేరొక్క చోటకు వెళ్లడానికి బాధపడతారన్నారు. జిల్లాల విభజన తర్వాత భూరీసర్వే, పరిపాలన అంశాలతోపాటు ప్రభుత్వ పథకాల అమలులో నాతవరం తహసీల్దార్‌గా జిల్లాలోనే ఉత్తమ అవార్డు కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి నుంచి అందుకోవడం చాలా ఆనందం కలిగించిందన్నారు. ప్రజలకు సేవలు చేయడంతోనే ప్రతి అధికారికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ మధు, నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

## తుది దశకు తారురోడ్డు నిర్మాణ పనులు

- రూ.1.25 కోట్లతో 3.38 కి.మీ మేర బీటీరోడ్డు నిర్మాణం



అద్దంలా తెనుగుపూడి-చినగంగవరం బీటీరోడ్డు



తారురోడ్డు నిర్మాణ పనులు

దేవరాపల్లి: తెనుగుపూడి – చినగంగవరం బీటీ రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో 3.38 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ. 1.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 7.50 మీటర్ల మేర వెడల్పున తారురోడ్డు నిర్మిస్తున్నారు. కొన్ని చోట్లు సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. అవరసరమైన చోట సిమెంట్ కల్వర్టులను సైతం నిర్మించారు. ఈ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరినా గత పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఛిద్రంగా మారి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వీరి కష్టాలను స్వయంగా చూసిన డిప్యూటీ సీఎం ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రెండు గ్రామాలతోపాటు చింతపాలెం, సంతపాలెం, రేగులబంద, తాటిపూడి తదితర గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ సందర్భంగా ఆయనకు వారంతా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.